# డాక్టర్ మేరి

జీవితంలో ఎందరు వ్యక్తులను చూడలేదు. ఎన్ని విధాలైన మనస్తత్వాలను చూడటం లేదు, కాని డాక్టరు మేరి నా దృష్టి పథంలో ఒక ప్రత్యేక వ్యక్తిగా నిలచింది. పచ్చని శరీర కాంతి, గుండ్రని కనులు, నల్లని ఆ కురులు కుదిరిన ఆ కోల ముఖం, సౌందర్యాన్నంతా ఒకచోట రాసి పోసి, ఆ రాసినే 'మేరి' అని పిలచిన ఆ సృష్టికర్త ఆ మోముపై అతి గంభీర్యాన్ని, ఆ గుండ్రని కనులలో ఎర్రజీరను, కోల ముక్కుపై కోపాన్ని ప్రతిష్ఠించి, తన సృష్టి కెందుకిలా వన్నె తగ్గించాడా అనిపించేది, నేను హాస్పటల్లో చేరిన క్రొత్తలో.

అందరూ మన్యప్రాంతమని భయపడిపారిపోతూన్న ఆ ప్రాంతానికి బదిలీ అవగానే, 'అయినా ఎలా వుందో చూచి వద్దాం' అనుకొంటూ ఒంటరిగానే వెళ్ళి ఉద్యోగంలో చేరాను. పట్టుమని 15 రోజులు తిరిగాయో, లేదో ఏదో క్యాంపు నుండి స్పృహ తప్పిన స్థితిలో తిరిగి వచ్చిన నన్ను ఒక కొత్త మిత్రుడు, ఆఫీసు జవాను రంగయ్య మిషన్ ఆస్పత్రిలో చేర్చారు. మరునాటి సాయంత్రం కళ్ళు తెరచి ఎక్కడున్నానో చూచుకొనేపాటికి, మంచం ప్రక్కన జవాను రంగయ్య, న్యుమోనియా, చలి జ్వరం, విష జ్వరం లాంటి వ్యాధులు సమపాళంలో కలిసి నన్ను వరించాయని, నేను మరో పక్షం రోజులు చికిత్స పొందితే, వెనుకటి మనిషిని అవుతానని చెప్పాడు.

'మహా యోగాలలో వ్యాధి రాజయోగం లాంటిదట పోనీ,' అనిపించింది.

'బాబూ, అప్పుడప్పుడు కన్పిస్తూ వుంటాను' అని చెప్పి వెళ్ళిపోయాడు రంగయ్య.

చీకటిపడి, లైట్లు వెలిగాయి. నర్స్, 'ఫ్లారెన్సు' వచ్చి ప్రక్క దులిపి సరిగ్గా పండుకోబెట్టి టెంపరేచరు చూచింది.

'ఎంతవుంది?' అని ప్రశ్నించాను.

నవ్వింది; అంతేః 'రోగికి ఇలాంటి వివరాలు చెప్పకూడదు -' అని ఆ నవ్వుకు భాష్యం కామాల్సు. సిస్టర్ 'ఫ్లారెన్సు' సహనాన్ని హారంగా, దయను తన సర్వస్వంగా చేసికొని పుట్టింది. ఆమె కనులలోని కాంతే కరుణ.

దూరంగా కాలి నడక ధ్వని వినిపించింది. నా ప్రక్క బెడ్ రోగి - 'ఆ వస్తోంది' అంటూ గొణుక్కున్నాడు, చిరాగ్గా. ఫ్లారెన్సు వాష్ బేసిన్, టవల్‌తో రెడీగా నుంచుంది.

తుపాను గాలిలా వచ్చింది డాక్టర్ మేరి. వస్తూనే మార్షల్ చూచినట్లు చూచి, కేస్‌షీట్ చదివి, స్టెతస్కోపుతో పరీక్షించి, ఏదో వ్రాసి వెళ్ళిపోయింది.

అంతా క్షణంలో ముగిసిపోయింది.

నా ప్రక్కరోగి నిట్టూర్చాడు, తనకేసి ఆమె రానందుకు.

నిక్షేపంలాంటి రోగిని నన్నేమీ అడగనందుకు కొంచం చిరాకేసింది. సిస్టర్ ఫ్లారెన్సు- 'ఈ పూటకు మీకు ఆహారం ఏమీలేదు-' అంది కేస్ షీటు చూచి.

ఆకలి మండిపోతోంది.

"అదేం?" అన్నాను. "డాక్టరు వ్రాశారు" అంది.

వ్యాధి రాజయోగం కాదని గట్టి నిర్ధారణ దొరికింది నాకు.

ఫ్లారెన్సు వెళ్ళిపోయింది.

నా ప్రక్క రోగి, సీతారామయ్య చెప్పటం ప్రారంభించాడు. "డాక్టరమ్మ మనిషి ఎంత నైస్‌గా వుంటదో, మనసంత గట్టి. అంతే. మాట్లాడదు, మాట్లాడ నివ్వదు. ఒకటి మాట్లాడితే తక్కువ, రెండు మాట్లాడితే ఎక్కువ!" అన్నాడు.

'మళ్ళీ మడిసి వుంటది గంటకో చీర కడతా-' అన్నాడు సీతారామయ్య.

అరవయి సంవత్సరాల జీవితాన్ని పచ్చి పల్లెటూరిలో గడిపిన సీతారామయ్య

లోని సౌందర్య ప్రశంసకు కొంచం ఆశ్చర్యమేసింది,

'మోటోళ్ళంటే మరీ ఈమెకి లోకువ' అన్నాడు. అలా అని, నాపై ఒక బాధ్యతను పారవేసాడు - 'చదువుకొన్న వాడివి నీవే మాత్రం ఆవిడతో వ్యవహరిస్తావో చూస్తానన్నట్లు-'

ఆనాటికి జ్వరాన్ని మేస్తూ, నిద్రకూ, జాగ్రదావస్తకూ, మధ్య ఓలలాడుతూ వుండి పోయాను.

ప్రొద్దున్నే ఫ్లారెన్సు వచ్చింది.

చిన్ననాడు అమ్మ చేసిన సేవను మరపించింది. శరీరమంతా తుడిచి, పండ్లు తోమి, ప్రక్కమీది గుడ్డ మార్చింది. ఒక విధంగా అలా సేవ చేయించుకోవ టానికి సిగ్గనిపించింది. కాని శక్తి లేక తల ఒగ్గాను.

'సిస్టర్ కాఫీ'' అన్నాను.

'కాఫీనా! డాక్టర్ని అడిగి వస్తాను' అంది.

ప్రజాస్వామ్యం దేశమంతటా అమలు జరుగుతూ వుండగా ఈ హాస్పిటల్లో మానవుడి ప్రాథమిక హక్కులు కూడ నశిస్తున్నాయేమా అనిపించింది. నేను పుట్టిన నాటి నుండి, విధీ విరామం లేకుండా త్రాగుతూన్న కాఫీ త్రాగటానికి కూడ హక్కు నశించింది అని తెలిసికొన్న క్షణాన ఏడుపు వచ్చినంత పనయింది.

'మరో గంటలో డాక్టరు వస్తారు-' అంది ఫ్లారెన్సు. 'అప్పటి వరకు కాఫీ త్రాగకుండ ఈ జీవుడు మనగలిగితే కదా!' అన్నాను.

7 గంటలయింది. మెరుపులా వచ్చేసింది మేరి. క్షణ కాలం కన్నెత్తి చూచిందేమో, ఏమో, కేస్ షీటుకేసి చూచి-' టెంపరేచర్ అలాగే ఉంది-' అను కొంది. ఏదో వ్రాసింది.

"మురారికి కాఫీ వద్దు-' అని చెప్పి వెళ్ళిపోయింది. తళుక్కుమన్న ఆ తెల్లటి టెర్లిన్ చీర, వెల్వెట్ జాకెట్ మెరపు నుండి తేరుకొనే పాటికి పది నిమిషాలు పట్టింది.

ఫ్లారెన్సు ఏదో ఇన్‌జెక్షన్ తెచ్చింది. ప్రాణాలు జివ్వుమన్నాయి. శరీరమంతా మెలికలు తిరిగింది. సీతారామయ్య సంతోషించాడు, నేను రోగిగా చేరినందుకు

డా. మేరి దృష్టి తన మీద తప్పి నా మీద పడిందట. నాకు వ్యాధి 'రాజయోగం' కాకపోగా మహా దారుణయోగ మనిపించింది.

రోజులు చిన్నగా ఆ గది గోడల మధ్య గడచి పోవటం ప్రారంభించాయి. ప్రతి దినం ప్రొద్దున, సాయంత్రం; డా. మేరి వచ్చిపోతూనే వుంది. కానీ ఏ నాడూ, అక్కడ ఒక జీవం వున్న మానవుడు వున్నట్లే గమనించినట్లు కన్పించదు. ప్రతి దినం ఎన్ని ఇన్‌జెక్షన్ను పొడి చేస్తోందో- లెక్క లేదు. శరీరమంతా తూట్లు పడిపోతోంది.

అదేదో మహర్షి చిన్నతనంలో తూనీగను చంపినందుకు వృద్ధాప్యంలో కొరత వేయబడినట్టు చదివిన జ్ఞాపకం. తెలిసి తెలిసి నేనలాంటి వేమీ చేసినట్లు జ్ఞాపకం లేదు; నాకీ ఇన్‌జెక్షన్‌ల బాధేమిటో!

ఒకనాటి ప్రొద్దున్న ఫ్లొరెన్సు కేసి జాలిగా చూచి, 'సిస్టర్ - నా శరీరంలో ఇంకా మీకు ఖాళీ దొరుకుతోందా?' అని అడిగాను.

ఫ్లొరెన్సు ఆగిపోయింది.

'డాక్టరు వ్రాసారు. నేనేం చేయను?' అంది. 'పోనీ ఆమెనే బతిమాలు కొంటాను. అప్పటి వరకూ వేచి వుండ'మని బ్రతమాలాడాను. ఫ్లొరెన్సు వెళ్ళి పోయింది కేస్ షీట్ తీసుకొని.

పది నిమిషాలు గడిచాయో లేదో, చేతిలో సిరంజితో మేరి ప్రత్యక్షమయింది. వాతావరణానికి సరిపోయినట్లు ఎర్రటి జార్జెట్టు చీరె ధరించింది.

మా వీధి బడి జోగయ్య మాష్టారు క్లాసులోకి వస్తూనే బెత్తంతో ఒకరిద్దరిని కొట్టేవారు మాటా పలుకూ లేకుండా; ఆ శిక్షకు ఆయన భాష్యం 'పిల్లలకు భయం వుండాలి' అని. ఆ క్షణాన ఆయన జ్ఞాపకానికి వచ్చారు. నేనేమీ చెప్పే స్థితి కాదు. కనులు మూసి కొన్నానంతే, రానున్న ఆపత్తుకు సిద్ధపడుతూ.

క్షణం గడిచిందిలా వుంది.

ఫొరెన్సు 'అలా కళ్ళు మూసికొని వుండిపోయారేం, ఇన్‌జెక్షన్ అయిపోయింది-' అంది.

కనులు తెరిచాను. ఆశ్చర్యమేసింది. మేరి వెళ్ళిపోవటం కూడ అయింది.

'ఈ పూట మీరు కావలసినంత కాఫీ త్రాగవచ్చు అని చెప్పారు డాక్టరు' అంది ఫ్లారెన్సు. డా. మేరీలో కూడ దయాఛాయలు వున్నట్లు అనుమానం వేసింది నాకు.

బహుశా రెండు ఫ్లాస్కుల కాఫీ త్రాగానేమో ఆ పూట. మరునాడు మేరీయే వచ్చింది ఇన్‌జెక్షన్ ఇవ్వటానికి. ఈ పూట కొంచం సేపు ఆగింది, కేస్‌షీటు చూస్తూ. ప్రక్కన వున్న కుర్చీలో కూర్చొంది. క్షణ కాలం నాకేదో పెద్ద గౌరవం జరిగినట్లు అనిపించింది.

'మురారీ! ఫ్లాస్కులో కాఫీ ఏమైనా మిగిల్చారా, లేదా?' అని. సమాధానం చెప్పబోయేలోగా 'ఈనాటికి ఏమీ వద్దు' అనేసి వెళ్ళిపోయింది.

'ఏం మనిషి-?' అనిపించింది. క్షణం కోపం, క్షణం, తాపం.

నా సహరోగి 'ఆ మడిసికున్న తిక్కే అది' అన్నాడు స్వగతం కాని విధంగా.

ఏమైనా, మేరి కొంచంసేపైనా నిలుచుంటోంది. మరునాడు ఆవిడతో మాట్లాడవలసిన విషయాలను గురించి ఆలోచించాను. ఏమైనా సరే ఆవిడతో మాట్లాడాలనే కోరిక బలవత్తరమయింది.

ఆఫీసు చిరునామాకు వచ్చిన జాబులను తీసికొని, జవాను రంగయ్య వచ్చాడు. ఒకటి శ్రీమతి నుండి. నా దగ్గర నుండి బొత్తుగా జాబులు లేవట; తనను పిల్లల్ని మరచిపోయానట; 'ఉమ' గోల చేస్తోంది; బాబుగాడు 'నాన్న, నాన్న' అని అడుగుతున్నాడు-' అని. గుభుక్కున పిల్లలు జ్ఞాపకానికొచ్చారు. ఏదో దిగులు వేసింది. క్షణాల మీద కొంపలో వాలుదాం అనిపించింది.

నాన్న వ్రాసిన జవాబు విప్పాను. 'అధికారులకు విధేయుడివై ప్రవర్తించు. ఆరోగ్యం జాగ్రత్త. అక్కడ నుండి నిన్ను బదిలీ చేయించటానికి ప్రయత్నం చేస్తున్నాను' అని.

సాయంత్రం 5 గంటలకు మేరి వార్డులోకి వచ్చింది, ఎందుకు వచ్చిందో. సీతారామయ్య దగ్గరకు వెళ్ళి కాలికి కట్టిన కట్టును పరీక్ష చేసింది. క్షణ కాలం కనులు మూసికొని ఆలోచించింది.

'డాక్టర్' అన్నాను ధైర్యాన్ని కూడకట్టుకొని.

ఏమిటో? ఉరిమినట్లు చూచింది.

గతుక్కుమన్నాను. కొంచెం తేరుకొని "నేను వెళ్ళిపోవాలి" అన్నాను.

'ఎక్కడికి?'

'పిల్లలు' అంతకన్నా మరేమీ అనలేక పోయాను. 'మీకేం తోచకపోతే కళ్ళు మూసికొని పడుకొండి, మమ్మల్ని మాత్రం విసిగించకండి' అని విసురుగా వెళ్ళి పోయింది.

నా కోపం కట్టలు తెంచుకొంది.

'సభ్యత తెలియని మనిషి' అన్నాను. ఆ మాటలు గాలిలో కలసి పోయాయి.

సీతారామయ్య 'పిల్లలంటే ఆవిడకేం తెలుస్తుంది. నెత్తికి 30 ఏళ్లు వచ్చినా పెళ్ళా? పెటాకులా?' అన్నాడు.

ఆ సానుభూతిపరునకు ఒక్క నమస్కారం పెడదామనుకొన్నాను.

అసలే రోగిని, పైగా పిల్లల మీది దిగులు, డాక్టరు మీద కోపం. జ్వరం బాగా వచ్చేసింది. మైకంలో వుండిపోయినట్లు వుండిపోయాను. ఎప్పుడు ప్రొద్దుకూకిందో లీలగా జ్ఞాపకం. రాత్రి 8గంటలకు సైరను ధ్వని. మరెంత సేపు గడచి పోయిందో, జ్ఞాపకం లేని పలవరింతలు. బాబు, ఉమ కన్పించినట్లు; ఒకటి రెండు సార్లు ఫ్లొరెన్సు లేపి, 'మురారీ ఏమిటి?' అని అడిగింది. ఎప్పుడు వేసిందో నుదుటి మీద చన్నీటి గుడ్డ. రాత్రి పదకొండు గంటల వేళ మాటలు వినిపించాయి.

'ఏమంటున్నారు మురారి-?'

'జ్వరం 104 డిగ్రీలు వచ్చింది. ఇప్పుడే తగ్గుతోంది. మగతగా వున్నారు.' అని ఫ్లొరెన్సు జవాబు.

కళ్లు తెరిచాను. డా॥ మేరి నా, సీతారామయ్యల మంచాల మధ్య కుర్చీలో కూర్చొని చూస్తున్నది.

నోటికి వచ్చినట్లు మాట్లాడదామనిపించింది. కానీ, అతి నీరసం. చేతనైనపని - కండ్లు పూర్తిగా తెరచి కసిగా చూచాను. నాకేసి చూచి, చిన్నగా నవ్వింది. అది హేళన అనిపించింది.

'మీ జ్వరం తగ్గేవరకు మిమ్మల్నిలా బాధ పెట్టవలసిందే మురారి... ఏం చేస్తాం, సభ్యత తెలియని మనిషిని-'

గతక్కుమన్నాను. నా మాటలు ప్రొద్దుట విందన్నమాట. నుదుటి మీది గుడ్డను తీసివేసి తన చేత నుంచి 'ఆవేశమూ ఒక విధమై వ్యాధే' అంది.

ఎలాగో మాట పెకల్చి 'మరి నిర్లక్ష్యత' అన్నాను.

'కన్పించటంలా, మీ ఆరోగ్యాన్ని ఎంత నిర్లక్ష్యం చేయకుంటే మీరిలా ఆస్పత్రికి వచ్చారు?' అంది నవ్వుతూ.

నా దగ్గర సమాధానం చెప్పటానికి శక్తి లేదు. అసలు సమాధానమూ లేదు.

'వస్తాను. కావాలంటే కాఫీ త్రాగండి' అని వెళ్ళిపోయింది. ఫ్లారెన్సు కాఫీ ఫ్లాస్కు చూచి 'కాఫీ లేదు మురారీ' అంది.

ఆ రాత్రి వేళ కాఫీ ఎక్కడ దొరుకుతుంది! కండ్లు మూసికొని పండుకొన్నాను. ఫ్లారెన్సు అలా బయటకు వెళ్ళి పది నిమిషాలలో వచ్చింది కాఫీతో, ఆశ్చర్యపోయాను.

'ఎక్కడిది?' అన్నాను. సమాధానం విని మరీ ఆశ్చర్యపోయాను.

కాఫీ లేవు అని చెప్పిన ఫ్లారెన్సుకు తన ఫ్లాస్కులోని కాఫి యిచ్చిందటమేరి.

కాఫీ త్రాగగా వచ్చిన ఓపికను పణంగా పెట్టి డా॥ మేరిని గురించి ఆలోచించాను. ఏమీ బోధ పడలేదు. కాని ఒకటి మాత్రం నిజం. డా॥ మేరిని గురించి, నేను చిత్రించు కొన్న రూపం బూదర బూదరగా మారిపోయింది, ఆ చిత్తరువు గాలిలో కలసిపోతున్నట్లు అనిపించింది.

★ ★ ★

రోజులు చిన్నగా గడచిపోవటం ప్రారంభించాయి. నాలో కొంచెం ఓపిక రావటం గమనించాను. డా॥ మేరి ప్రతి రోజు ప్రొద్దున, సాయంత్రం, అర్ధరాత్రి వచ్చి చూచి పలుకరిచటం, వ్యాధిని గురించి చెప్పటం ప్రారంభించింది. నా వ్యాధి అదేదో మన్యప్రాంతాలలోను, చిరపుంజి ప్రాంతీయులకు చాల అరుదుగా వస్తుందట. జ్వరం రోజుకు అర డిగ్రీ తగ్గుతోంది. 'ఇలా తగ్గితే మరో వారం రోజులలో నార్మలుకు వస్తుంది' అంది ఒకనాడు.

'డాక్టర్, కాలాన్ని కాగితాలలో మూట కట్టటం నేర్చుకొన్న వాణ్ణి ఇలా భారంగా కాలాన్ని మ్రింగలేను' అన్నాను.

'ఏమైనా చదువుకోండి' అంది.

'ఆఫీసు ఫైళ్ళు తెప్పించుకొని,'

అవికాదు సుమా' అనేసి వెళ్ళిపోయింది. ఆనాటి సాయంత్రం వచ్చినపుడు ఏవో యింగ్లీషు పుస్తకాలు తెచ్చియిచ్చింది

'అసలు మీ వ్యాధికి సంబంధించిన మెడికల్ పుస్తకాలే తెద్దామనుకున్నాను, కానీ, విద్యార్థిని ఉపాధ్యాయునిలా చూడవలసి వస్తుందేమో అని మానివేశాను' అంది.

ఆరోజు సీతారామయ్యను అరగంట పైగా పరీక్ష చేసింది. నాకు విచిత్రమేసింది. ఈ మధ్య సీతారామయ్యను ఎందుకో వచ్చినప్పుడల్లా పరీక్ష చేస్తున్నది. ఏమీ మాట్లాడదు. క్షణం అలా కనులు మూసికొని ఆలోచిస్తుంది, అంతే! సీతారామయ్యను చూదామంటే నిక్షేపంలా కన్పిస్తున్నాడు. ఏ బాధా పడుతున్నట్లు కన్పించడు.

మేరి వెళ్లాక సీతారామయ్యనే అడిగాను, డాక్టరు అంతసేపలా చేసే పరీక్ష ఏమిటని-

ఏనాడూ అంత సులువుగాలేవని సీతారామయ్య, గజం బద్దలా లేచి కూర్చుని-' ఎందుకా? ఇది వ్యాపారం బాబూ! వైద్యం చేయాల్సింది అయిపోయింది ఇక మిగిలింది బిల్లు. ఆ బిల్లు వందలు వేయటానికి ఎంతో చూస్తున్నట్లు నాటకం ఆడతారు-' అన్నాడు.

సీతారామయ్య మాటలు నా కంతగా రుచించలేదు. పైగా ఏదో బాధగా ధ్వనించాయి. సీతారామయ్య మనస్సు, దృష్టి, ఆర్థిక తత్వాన్ని జీర్ణించుకొనే వున్నాయని పించింది.

సీతారామయ్య ఇంకా ఏమేమో మాట్లాడడానికి ప్రయత్నించాడు కానీ, నా నుండి తగిన ప్రోత్సాహం లేకపోవటంతో మాట్లాడటం మానివేసి పండుకొని పోయాడు.

డా॥ మేరి తెచ్చియిచ్చిన పుస్తకం చదువుతూ వుండిపోయాను, చాలసేపటి వరకూ. అదేదో చిన్నపుస్తకం. పూర్తి అయింది. కాని నిద్ర రావటం లేదు. ఇంటికి జాబు వ్రాద్దామని లేచికూర్చొన్నాను, కలం కాగితం తీసికొని. డా. మేరి ఫ్లారెన్సు వచ్చారు.

'ఇంకా మీరు మేలుకొనే వున్నారా?' అంది మేరి. నేను మాట్లాడలేదు.

'జాబు తీరిగ్గా, రేపు ప్రొద్దున వ్రాసుకోవచ్చు. విశ్రాంతి తీసుకోండి; అధికశ్రమ చేసే స్థాయికి మీరింకా ఎదగలేదు' - అంది.

'జాబు కాదు- కథ వ్రాస్తున్నాను' అన్నాను. మేరి నా కేసి క్షణ కాలం తలెత్తి చూచింది. ఏమీ మాట్లాడకుండా, సీతారామయ్యను పరీక్షించటం ప్రారంభించింది. సీతారామయ్య మేల్కొని అదోలా మొహం పెట్టాడు. తానేదో అనవసరపు ప్రయోగాలకు గురి అవుతున్నట్లు.

పరీక్ష పూర్తిచేసి, ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్న మనస్సుతో, మేరి నా మంచం దగ్గరకు వచ్చింది.

'ఏం కథ వ్రాస్తున్నారు?'

'వట్టిదే. ఏదో అలా అన్నాను. ఏమీ వ్రాయటంలేదు, మేరి నా మంచం ' మీదకు వాలి, నా కళ్ళలోకి చూచి, 'మురారీ! నాకు తెలుసు, మీరు ఫలానా అని రంగయ్య చెప్పాడు. మీ కథలు చదివిన జ్ఞాపకం నాకుంది. మీరు ఈ సంఘ ధర్మకర్తలే-' అంది.

మేరీకి తన వృత్తికాక, పుస్తకాలు చదవటానికి కూడ విశ్రాంతి వుందా అనిపించింది.

'ఏమిటి ఆలోచిస్తున్నారు? ఈ మేరీకి, లౌకిక ప్రపంచంతో కూడ సంబంధంవుందా అనా....? మురారీ! మేరి, ఈ లౌకిక ప్రపచంలోనే పుట్టింది.... పెరిగింది..., కానీ....' ఆగిపోయాయి ఆమె మాటలు.

మేరిని చూస్తూ స్తబ్ధత చెందాను. ఆమె కనుకొనల నుండి రెండు అశ్రువులు తళుక్కున మెరిసి జారిపోయాయి. ఆమె వెళ్ళిపోయింది.

నాకు కన్పించింది మేరి కన్నీటి కణాలు కావు. ఆమెలోని స్త్రీత్వం. మొదటిసారిగా మేరి నాకు ఒక స్త్రీగా కన్పించింది. ఆమెను గురించి ఏమీ ఆలోచింప లేకపోయాను. ఆమె మనస్తత్వాన్ని, పరిస్థితులను, సాగిస్తున్న జీవితాన్ని సమన్వయపరచి ఒక నిర్ణయానికి రావటానికి చేసిన ప్రయత్నం, ఇసుక రేణువులతో చేసిన బొమ్మరిల్లు అలల తాకిడికి కరగి పోయినట్లు, కరిగి పోసాగింది.

ఆలోచనల మధ్య నిద్ర ఎప్పుడు పట్టిందో, గబుక్కున మెలకువ వచ్చింది. రాత్రి మూడు గంటలయి వుంటుంది. నలుగురయిదుగురు నర్సులు, ఇద్దరు ముగ్గురు జూనియరు డాక్టర్లు, డా॥ మేరి హడావుడిగా, సీతారామయ్య మంచం చుట్టూ మూగి వున్నారు. బాధతో మెలికలు తిరిగిపోతున్నాడు.

ఎవరిని ఏమీ అడగటానికి పడింది కాదు. అంతా హడావుడిలో వుండి పోయారు. డా మేరి ఏదో ఇన్‌జక్షన్ ఇచ్చింది. మత్తులో పడిపోయాడు సీతారామయ్య.

'ఈ స్థితిలోనే వుంచి, చూస్తే' అన్నాడో డాక్టరు. మేరి క్షణ కాలం కనులు మూసికొని నిశ్శబ్దంగా ఆలోచించింది.

'వీల్లేదు, అపరేషను వెంటనే జరగాలి' అంది. కొన్ని నిమిషాలలో సీతారామయ్యను తీసుకొని వెళ్ళారు. గదంతా నిశ్శబ్దమయింది. నాకు భయం వేసింది.

ఏమిటీ జీవితాలు, నిన్న సాయంత్రం తనను యింటికి పంపలేదని విసుక్కొన్న సీతారామయ్య ఆపరేషన్ గదిలోకి వెళుతున్నాడు.

మానవుని ఉనికి ఎంత అనిశ్చితమయిందో! సిస్టర్ ఫ్లారెన్సు వచ్చింది. సీతారామయ్యను గురించి అడిగాను.

సీతారామయ్యకు మొదట కాలి మీద వ్రణం వేసిందట. నయమైనట్లే నయమై విషమించిందట. 'అదేదో విచిత్రమైన జబ్బు. ఆయన ప్రాణాలకే ముప్పు వచ్చింది. ఆయన బ్రతకటం కష్టమట' అని చెప్పి, 'ఏమైనా భగవంతుని కృప. మనదేముంది? ఆయన నిర్ణయం ముందు మన నిర్ణయాలు, ఆశలు, ప్రయత్నాలు నిమిత్త మాత్రాలు కదా!' అంది.

అంత పెద్ద గదిలో ఒక్కణ్ణి వుండటానికి భయం వేసింది. ఏదో పుస్తకం తీసుకొని చదవటం ప్రారంభించారు. సాగింది కాదు. మనసంతా ఈ అస్థిరమైన మానవుని మనుగడ మీదకు, జనన మరణాల మధ్య ఊగిసలాడే, ఈ జీవుల దీనస్థితి మీదకు వళ్ళింది. మనసంతా విషాదమయింది. ఏదో వ్రాద్దామని ప్రారంభించాను. ఒక గంట గడచింది. డా॥ మేరి వచ్చింది.

'మీరిలా మేలుకోవటానికి వీలులేదు. టైమెంతో మీకు తెలుసా? మరో

గంటలో తెల్లవారుతుంది' అంది.

ఆమెకేసి అలా చూస్తూ వుండిపోయాను. అలసిపోయినా ఆ కనులు దేనినో సాధించిన కాంతితో వెలిగిపోతున్నాయి. ఆపరేషన్ గది నుండి వస్తున్నట్లుంది. నెత్తిమీది ఆ గుడ్డ టోపీనైనా ఊడతీయలేదు. మూర్తీభవించిన సేవామూర్తిలా కన్పించింది, డా॥ మేరి .

'ఏమిటి ఆలోచిస్తున్నారు మురారీ?'

'ఏమీ లేదు ఈ జీవితాలకు ఆద్యంతా లెక్కడో, ఈ సేవాపరాయణతకు విలువెంతో అర్థంకాక-'అన్నాను.

డాక్టర్ మేరి అదోలా చూచి,- 'నిద్ర లేకుంటే జబ్బు చేస్తుంది. విశ్రాంతి తీసికొండి.' అంది.

'అదే ఆలోచిస్తున్నా, డా. మేరి! నిద్రను ఎవరికి దానం చేసి ఇలా ది వారాత్రాలు జాగ్రదావస్తతో తిరుగాడుతోందా, అని!'

'మురారీ! నేనేమిటి, నా లాంటి వాళ్ళు లక్షలాది. ఇది విధి నిర్వహణ; భగవన్నిర్దేశం. మా విషయం వేరు - మీ విషయం వేరు.'

'అవును! మీరు వేరు. అదే ఆలోచిస్తున్నాను.'

'నిద్రపొండి.' అని డాక్టర్ మేరి వెళ్ళిపోయింది.

తెల్లవారాక 9 గంటలకు జవాను రంగయ్య వచ్చి నిద్ర లేపాడు. అంతటి వరకు నిద్ర పోవటం, ఫ్లారెన్సు లేపకుండా వుండటం, ఆశ్చర్యకరమైన విషయమే! కాఫీ తాగుతూ వుండగా ఫ్లారెన్సు వచ్చింది. నిద్ర లేపవద్దని మేరి చెప్పిందట.

రోగిని అహోరాత్రాలు తల్లిలా కాపాడే, మేరి ఆత్రుత ముందు కరిగి పోవాల్సిందే!

ఆ రోజల్లా అదోలా వుంది. క్రిందటి రాత్రి జరిగిన సంఘటన నన్ను విచలితుణ్ణి చేసి వేసింది. ఏదో వ్రాసికొంటూ కొంత కాలం గడిపివేసాను. సీతారామయ్యకు ఆపరేషన్ చేసాక, అక్కడే ప్రక్క గదిలో వుంచారట. మేరి, రోజల్లా అక్కడే వుండిపోయింది. ఒకటి రెండు సార్లు, సీతారామయ్యను గురించి, వాకబు చేసాను.

దివస్సు హరించిపోయి రాత్రి వచ్చింది. రాత్రి 10 గంటలయింది. ఏదో ఆలోచిస్తూ వుండిపోయాను. యుగాలుగా సాగిపోతూన్న కాలగమనంలో ఇంకా, ఆశ్చర్యం, అర్థం కాని తనం మిగిలివుందేమో అనిపించింది.

డా. మేరి వచ్చింది.

పరిశీలించి చూచాను. ఆమె డాక్టరుగా రాలేదు. మెడలో స్టెతస్కోపు లేదు; తళ తళ లాడుతూన్న బంగారు లాకెట్టు వుంది. తలంతా స్నానం చేసాక దువ్వినట్టు రేగి వుంది. డా. మేరి అక్కడికి రావటం వికలంగా వున్న నా మనస్సుకు హాయి అనిపించింది.

'మనసేం బాగలేదు మురారీ! ఊసుపోక వచ్చాను' అంది.

'అదే మిమ్మల్ని అడగాలనుకొంటున్నాను, మనసు బాగుండటానికి మందేదైనా ఇవ్వండి' అన్నాను.

'లేదు మురారీ! మనశ్శాంతికి మందులుంటాయా? వీటికి మందులు భావుకులు, రచయితలు, మీరే చెప్పాలి.' అంది.

'నేనా? కాదు. మీ వైద్య శాస్త్రం చెప్పాలి. మీ వైద్య శాస్త్రం చెప్పవలసింది చాలా వుంది. మానవ సంకల్ప వికల్పాలకు అతీతంగా, ఈ జనన మరణాలేమిటో, మానవ హృదయాలలోని దౌర్భల్యాలకు, ఆశలకు, క్రౌర్య కాఠిన్యాలకు.... వీటన్నింటికి కారణాలను-'

మేరి మౌనంగా వుండిపోయింది. ఫాన్ గాలికి ఆమె ముంగురులు ఉవ్వెత్తుగా లేచి సముద్రంలోని అలల్లా కన్పించాయి. మేరి ఎంతో సౌందర్యవతి అనిపించింది.

'ఏమిటి ఆలోచిస్తున్నారు?' అన్నాను.

మేరి తలెత్తింది. ఆమె కనుకొలకులనుండి కారిపోతున్న కన్నీటి ధారలు కన్పించాయి. కంపించి పోయాను. 'ఆమె మేరియేనా?' అని అనిపించింది.

'డాక్టర్'అన్నాను -

'క్షమించండి, మురారీ! ఈ మానవహృదయాలనూ, వాటిలో జనించిన క్రౌర్య కాఠిన్య జనిత కారణాలనూ వైద్య శాస్త్రం నిర్వచించలేదు. మన దౌర్భాగ్యం అది. ఈ జనన మరణాల విషయం మరీ అతీత' ఆమె కన్నీరు ఆగలేదు.

మేరి అంతరాంతరాలలో, ఏదో, ఏనాడో రగులుకొన్న అగ్ని మా సంభాషణ చేత కొత్త సమిధను అందుకొన్నట్లు ప్రజ్వరిల్లుతోంది. ఆమెలో క్రీనీడలుగా ఏదో మహత్తర విషాదమయ గాథ తన నిజాకృతితో నా ముందు ప్రత్యక్షమవటానికి ప్రయత్నం చేస్తోంది.

అంతా నిశ్శబ్దంగా వుంది.

డా. మేరి అంతటి వ్యక్తి, నా ముందలా కన్నీరు గార్చటం చూచిన నేను, భగవంతుడు మానవులనందరిని సమానంగా పుట్టించి, సుఖ దుఃఖాల పట్ల వారిని సమంగా వుంచాడా అనిపించింది. ఈ వేష భాషలు, అధికార ఆడంబరాలు, అన్ని సాంఘికమైనవే.

'అవును. డాక్టర్! మానవుడి మేధకు అందక మిగిలిపోతున్నది చాలా వుంది. మనకిక శరణ్యం ఆధ్యాత్మికత, మతం.... ఇవే-' అన్నాను.

మేరి కొరడాతో చరిచినట్లు ఉలిక్కి పడింది. ఆమెలో ఏదో ఉద్వేగం పెల్లుబికింది. ఆ సజలనయనాలలో ఎర్రటి జీర కన్పించింది.

'కాదు మురారీ! వైద్య శాస్త్రంలో యింకా తెలియనిది వుంటే, ఈ వేదాంతం లో మోసం వుంది. మతం పేరిట మానవుల కారుణ్యాన్ని హింసిస్తున్నారు-' అంది ఆవేశంగా.

ఆమెతో వాదించగల శక్తి నాకు లేదు. సముద్ర తరంగాలు వచ్చి మొహంపై తాకుతోంటే ఉక్కిరి బిక్కిరి అయినట్లు వుంది నా స్థితి, మేరితో మాట్లాడుతుంటే.

కానీ ఆమెను గురించి ఆలోచిద్దా మనిపించింది. 'చూడండి.... డాక్టర్, ప్రతి దానిని కాదని మనం చేయగల్గింది ఏమీ లేదు. కొన్ని సత్యాలుంటాయి; వాటిని, మనం రాగద్వేషాలకు అతీతంగా వుంచి ఆలోచించి ఒప్పుకోవాలి. పరిస్థితులతో రాజీ పడి జీవించటం ఒక విధానం. ఇదే వేదాంతం కావచ్చు. సంస్కారం కావచ్చు. ఏదైనా శుష్కమైన ఈ జీవితంలో మనం సాధించాల్సిన వాటికై చిత్త శుద్ధితో ప్రయత్నం జరిపితే జన్మకు ధన్యత. ఈ లోకరీతి, దివారాత్రాలుగా ఇలా ఎందుకు సాగిపోతూంది అంటారు. ఈ గడ్డి ఎందుకు మొలుస్తోంది? ఆ తల్లి కాకి తన సంతానికి ఎందుకు ఆహారం సంపాదించి పెడుతోంది? ఈ లత

లెందుకు తమ సౌందర్యాన్నంతా పుష్పాలలో పొదవి మన కర్పిస్తున్నాయి? మానవుని మనుగడకు ప్రకృతి ఎందుకు తన కరుణా హృదయాన్ని పక్కగా పరుస్తోంది.....? ఇదంతా సేవాపరాయణత.... ఈ మహత్తర.....'

నా ఉపన్యాసాన్ని మేరి ఆపింది. 'మురారీ, ఒక దీనగాధను విని, తీర్పు చెప్పగలవా?' అంది.

ఆగిపోయాను.

★ ★ ★

30 సంవత్సరాల క్రితం, పతితలను తన బాహువులలో పొదవి పట్టుకొని ఆదరించగల మిషన్ హాస్పిటల్లో, కులం, మతం తెలియని ఒక యువతి గర్భాన జనించింది ఓ పసికందు. ఆ పసికందును వదలివేసి ఆ తల్లి మూడవనాటి నిశిరాత్రి భీరువై పారిపోయింది. ఆ పసికంధును హాస్పిటలు నర్సింగు సూపరిండెంటు సిస్టర్ విజయాకర్ పెంచటానికి తీసికొంది. అనాటి ఆ పసికందే ఈ 'మేరి'.

ప్రొఫెసర్ కరుణాకర్, విజయాకర్ సోదరుడు; యూనివర్సిటిలో చరిత్రా చార్యుడు. విదేశాలకు వెళ్లి పరిశోధనలు చేసి వచ్చాడు. అద్వితీయ ప్రతిభతో సాగిపోయిందాయన జీవితం; కాని, అమెరికాలో పెళ్ళాడిన ఆయన భార్య 'రేచల్' భారతావని నచ్చక తిరిగి వెళ్ళిపోయింది వివాహాన్ని రద్దు చేసికొనీ. కరుణాకర్ జీవితం ఛిద్రమయింది. జీవితమంతా నిరుత్సాహంగా ధ్వనించింది. సిస్టర్ విజయాకర్, తన సోదరుని దగ్గరే వుండి అతనికి చిత్తశాంతిని కూర్చుతోన్న ఆ స్థితిలో 'మేరి' ఆయింట చేరింది. ఆ పసిపాప కళ్ళలోని కాంతి, కరుణాకర్‌లో జీవితవాంఛను రేపింది. ఆమె సమక్షంలో అతను సర్వస్వాన్ని మరచిపోగల్గాడు. ఆ నాటి నుండి 'మేరి'కి తండ్రి కరుణాకరే!

ఇదంతా మేరి బాల్యం. మేరికి ఊహ తెలిసేపాటికి, విజయాకర్ కన్ను మూసింది. ఇక మేరికి సర్వస్వం ప్రొఫెసర్ కరుణాకరే అయ్యారు. ఆమె జీవికకు చుక్కానిలా వుండి పైకి తీసికొని వచ్చాడు.

మేరి విశాఖలో మెడిసిన్ చదివింది. అక్కడే హిస్టరీ ఆనర్సు విద్యార్థి

'శివశర్మ' పరిచయమయ్యాడు. శివశర్మ, కరుణాకరుకు చాల అభిమానమైన విద్యార్థి. అతనిలోని చురుకుతనం, మేధ, సరళ స్వభావం, మేరిని ఆకర్షించాయి. వారిద్దరు ఎంతో స్నేహంగా మసలేవారు.

శివశర్మలోని జ్ఞాన మరీచికలను చూచి, మేరి విస్తుపోయేది. ఇద్దరూ పై చదువుల కోసం అమెరికా వెళ్ళారు. అక్కడ శివశర్మ చరిత్ర మానివేసి, ఫిలాసఫి చదవటం ప్రారంభించాడు. మేరి సర్జరీలో రిసెర్చి చేసింది.

ఆ దూరదేశంలో వారి స్నేహలత దిన దిన ప్రవర్ధమానమై పెనవేసికొంది. మేరి హృదయమంతా శివశర్మ మిగిలి పోయాడు.

★ ★ ★

'మురారీ! ఏమని చెప్పను? నాకు సర్వస్వమూ అయి, ఈ విశాల ప్రపంచాన్ని నేను కనులు తెరచి చూడటానికి ఆధారభూతుడైన కరుణాకరం బాబాయి హఠాత్తుగా మరణించారని వచ్చిన తంతి వార్త చూచుకొని నిశ్చేష్టితనై పోయాను. 'శివం' నా ప్రక్కన లేకుంటే ఏమైపోయేదానినో! ఎంతో వేదాంతాన్ని నూరిపోస్తూ అహర్నిశలూ నా చెంత నుండి నన్నొక వ్యక్తిని చేసాడు. కళ్ళలో బాబాయి కన్పించినట్లు వుండేది. ఆయన జీవించి వున్నట్లే వుండేది. మరుక్షణం ఈ హృదయం కోసికొని పోయేది.

'మేరీ, ఏది శాశ్వతం-?' అని నన్ను మరపించేవాడు శివం. 'శివం' బలవంతం మీదనే రిసెర్చి పూర్తి చేయగల్గాను. తిరిగి స్వదేశానికి వెళ్ళిపోదాం రమ్మన్నాను. శివం తానేదో చదివి శోధించాలి, రానన్నాడు.

ఈ దేశానికి తిరిగి రానున్న నాటి రాత్రి, నా హృదయాన్ని విప్పి 'శివం' ముందుంచి నన్ను తన దానినిగా స్వీకరించమన్నాను.

శివం నా ఆశాసౌధాలను అంతగా కూల్చి వేస్తాడని నేనేనాడూ ఊహించలేక పోయాను. చిన్నగా నవ్వి, 'మేరీ! నీది, నాది అనే దానిని ఎందుకు సృష్టించు కొంటావు? అంతా అశాశ్వతం-' అన్నాడు.

నా కన్నీటిని పణంగా పెట్టి వేడుకొన్నాను. లాభం లేకపోయింది. నన్ను విమానం ఎక్కించి, అతనక్కడ మిగిలి పోయాడు. స్వదేశం తిరిగి వచ్చిన నాకు సర్వం నిరుత్సాహంగా కన్పించింది. మిషన్ హాస్పిటల్లో డాక్టరు వృత్తి ప్రారంభించాను.

నా మనస్సంతా 'శివం' వైపే పరిభ్రమించసాగింది, సర్వకాల సర్వావస్థలయందు, 'శివం' నా మనోవీధిలో ప్రత్యక్షమయ్యేవాడు.

రెండు సంవత్సరాల తనంతరం, 'శివం' తిరిగి వచ్చాడని తెలిసి, చూడటానికి వెళ్ళాను. ఆనాటి సాయంత్రం సాయం సంధ్యలో వారి మేడపై భాగంలో కూర్చొని ఏవేవో ఊసుపోక కబుర్లు చెప్పుకొన్నాం.

'ఎలా వుంది జీవితం?' అని ప్రశ్నించాడు శివం. 'నీదానిని కాని లోటు కన్పిస్తోంది-' అని మరో మారు నాలో కూలిపోలేక మిగిలిపోయిన ఆశను శివం ముందుంచాను.

ఆ జారిపోతున్న వెలుగు రేఖలకు, అలముకొంటున్న చీకటికి మధ్య నిలువబడి శివం కనులు నాకేసి చూచాయి.

'మేరీ! నా శోధన పూర్తి కాలేదు. జీవిత ఆద్యంతాలను గురించి ఆలోచిస్తున్నాను. బహుశా ఈ జీవిత కాలం చాలకపోవచ్చు-' అన్నాడు.

నిరాశను ధ్వనిస్తూ కన్నీరు జారిపోయింది నా నుండి. నేనేం చేయను? నా హృదయాన్ని నివేదించాను. తిరస్కరింపబడింది.

ఆ మరునాడు, 'శివం' నాన్నగారిని, 'గంగాధర' శాస్త్రిగారిని కలుసుకున్నాను. తన ఏకైక పుత్రుడిలా వేదాంతిగా మారిపోవటానికి ఆయన ఎంతో చింతించారు. అతనినో ఇంటివాణ్ణి చేయాలనే ఆతృత కన్పరచారు. నాలో ఆశ తలెత్తింది. నా అభీష్టాన్ని చెప్పాను. ఆయన మౌనాన్ని వహించారు. నా పుట్టు పూర్వోత్తరాలను గురించి ప్రశ్నించి, చెప్పకనే చెప్పారు తన అభిప్రాయాన్ని.

తిరిగి వచ్చివేశాను.

ఆ తరువాత నా కర్థమయింది, శివంలో నిర్దయ; వేదాంతం పేరిట వారిలో పెంపొందిన జ్ఞానాలవ దుర్విదగ్ధత. నిద్రిస్తూ, భుజిస్తూ, జీవిస్తూ ఈ సర్వస్వం అశాశ్వతం అనే పేరిట ఆయన చేస్తున్న మిధ్యావాదం పట్ల అసహ్యం వేసింది.

శివం సర్వ క్షేత్రాలు తిరిగాడట. సన్యాసి అయ్యాడట. మళ్ళీ ఆ సన్యాసాన్ని త్యజించి తల్లి పోయిననాడు అంత్యక్రియలు జరిపాడట. శివం వ్రాసిన వేదాంత వ్యాసాలను చదివాను. ఒకటి రెండు సార్లు ఉపన్యాసాలు విన్నాను. తా నాచరించలేని

సర్వమత సామరస్యాన్ని గురించి మాట్లాడారాయన. ఏమిటో...

'మురారీ! ఈ వైద్యశాస్త్రం ఏదో చెప్పవలసి వుందన్నావు. అందుకు చెపుతున్నాను. ఈ శాస్త్రం ఈ పీడిత మానవకోటిని రక్షిస్తోంది. కాని ఈ వేదాంతం మానవుడిలో జీవితేచ్ఛను చంపుతోంది.'

★ ★ ★

డా. మేరి లేచి వెళ్ళిపోయింది. ఒక మహా విషాద వాహిని ఒడ్డునొరసి పారినట్లు ఆమె కన్నీటిని చూచాను. మొదటిసారిగా నేను చూచిన 'మేరి'కి, ఈమెకు ఎంత భేదం; మేరిలో స్త్రీని చూడగల్గాను. ఓడిపోయిన స్త్రీత్వం... మనశ్శాంతి కోసం, జారిపోయిన ఏదో అమూల్య వస్తువు కోసం తహతహ లాడుతున్న ఆ హృదయ విభ్రాంతి కన్పట్టింది.

శివశర్మ నా కనుల ముందు నిలచారు. ఏమీ అర్థం కాలేదు. ఏమిటో విభిన్న దృక్పథాలతో సాగిపోతూన్న జీవితాలు. మేరి పట్ల సానుభూతి నాలో పెరిగిపోయింది. కాని, నేను చేయగల్గింది ఏముంది? ఆ లత అలా వాడిపోవలసిందే! మానవులకు ఎన్ని సమస్యలు? ఎంతటి వ్యధ?

ప్రొద్దున్నే కాఫీ త్రాగేపాటికి, నా అనారోగ్య వార్త తెలిపిన జాబు చూచుకొని, మనస్సునే వేగంగా చేసికొని, నాన్న వచ్చారు. వస్తూనే చిక్కిపోయిన నన్ను చూచి, కంట తడిపెట్టారు.

'నాయినా! ఈ కాని దేశంలో ఎంత కష్టపడ్డావురా?' అన్నారు. అది పితృహృదయం. నాన్న ఏవేవో అడిగారు. పిల్లలు ఎంత బెంగపెట్టుకొందీ చెప్పారు. చివరికి ఈ ప్రాంతం నుండి బదిలీకి ప్రయత్నం చేసారట. కొద్ది రోజులలో ఆర్డర్లు వస్తాయట, ఈ లోగా సెలవుపెట్టి ఇంటికి వెళదామని తేల్చారు.

అక్కడి నుండి ఇంటికి వెళ్ళటం అంటే ఏదోగా అనిపించింది. నాన్నా, నేనూ మాట్లాడుతూ వుండగా, డా. మేరి వచ్చారు. నాన్నను పరిచయం చేసాను.

'నమస్కారం!' అంది,

నాన్న ఆమెకు కృతజ్ఞత చెప్పారు.

'నేను చేసింది ఏముంది?' అంది.

మేరి వెళ్ళాక 'చిన్న పిల్ల అయినా ఎంతో బుద్ధిమంతురాలు' అన్నారు నాన్న.

ఓ గంట గడిచాక దూరపు బంధువులు ఎవ్వరో వున్నారు చూచి వస్తానని వెళ్ళారు ఊరిలోకి.

ఫ్లారెన్సును 'సీతారామయ్యకు ఎలా వుందీ?' అని అడిగాను.

'నయమే చూడాలనుకొంటే చూచిరండి' అంది.

వెళ్ళాను. క్షణ కాలం స్థబ్దత చెందాను సీతారామయ్యను చూస్తూనే. కుడి కాలు మోకాటి వరకు తీసివేసారు. నన్ను చూస్తూనే కన్నీళ్లు పెట్టుకొన్నాడు; కాలు పోయి నందుకు కాదు.

'బాబూ, తెలిసీ, తెలియక డాక్టరమ్మగారిని ఎన్ని మాటలన్నాను? ఆమే లేకుంటే నేనేమయ్యేవాణ్ణో...' అన్నాడు. సీతారామయ్యలో చాలా మార్పు కన్పించింది. డా. మేరి పట్ల ఎంతో గౌరవం పెరిగింది.

'మనలాంటి వారి కోసం తన బతుకంతా ధారపోస్తా వుంది' అన్నాడు.

మేరి వచ్చింది. సీతారామయ్య కాలి కట్టు చూచి, తృప్తిగా నిట్టూర్చి, నా కేసి తిరిగి 'స్నేహితుణ్ణి చూడటానికి వచ్చారా?' అంది.

మేరి, నేను క్రిందికి దిగి, వార్డు కేసి వచ్చాం. వచ్చేపాటికి, గదిలో నాన్న, మరో వ్యక్తి కూర్చొని వున్నారు.

'వీడే మా అబ్బాయి' అన్నారు నన్ను చూపి. మేరి వాకిటి ముందే నిలచి పోయింది. ఆయన గంగాధరశాస్త్రిగారట. అంటే 'శివశర్మ' తండ్రి.

గుభుక్కున ఒక్క ఆలోచనా రేఖ పొడచూపింది. మేరి ఈ హాస్పిటల్లో ఎందుకు పనిచేస్తోందో-? ఆశ ఎంత బలీయమయిందో!

నేను తిరిగి వెళుతోన్న మేరిని, బయటకు వెళ్ళి పిలిచాను. 'క్షమించు మురారి! ఈ మత ధర్మకర్త సమక్షంలో నేను నిలవలేను' అంది.

చాలాసేపటివరకు ఏవేవో మాట్లాడుతూ గడిపివేసాం. భోజనానికి వాళ్ళింటికి రమ్మన్నారు గంగాధరశాస్త్రిగారు. రాత్రికి వస్తానని చెప్పాను. నాన్న, ఆయన వెళ్ళి పోయారు, సాయంత్రం నన్నూ తప్పక రమ్మని చెప్పి.

సాయంత్రం గంగాధరశాస్త్రిగారింటికి వెళ్ళాలని నే నిర్ణయించుకోవటంలో పరమార్థం- 'మేరి' ఆ లతలా వాడిపోవటం సహించవలసిన విషయం కాదని పించటం. నిరాశా నిస్పృహలతో, రాలి పోతున్న ఆ కాంతి పుంజాన్ని చూస్తూ ఉపేక్షించటం ధర్మం కాదనిపించింది. ఏమైనాసరే, 'శివ శర్మ'ను కలుసుకొని మేరి హృదయ విదారక స్థితిని చెప్పి ఫలితం కోసం ఎదురుచూడాలనిపించింది. మేరిపట్ల మానవతాత్మకమైన బాధ్యతను స్వీకరించాను.

ఆ పగలల్లా మేరిని కలుసుకోవాలని ప్రయత్నించాను. వీలుకాక పోయింది. సాయంత్రం నేను బయలుదేరి వెళుతూండగా కన్పించింది.

గంగాధర శాస్త్రిగారింటికి వెళుతున్నానని చెప్పాను. తన కారు తీసికొని వెళ్ళమని డ్రైవరును పిలచింది.

గంగాధర శాస్త్రి గారింటిలో, నా కళ్ళన్నీ ఆ శ్రీమంతుల భోగభాగ్యాలకు దర్పణమైన వస్తు వాహనాలమీదకన్నా 'శివశర్మ' కోసం వెతికాయి. భోజనాల దగ్గర కూడా 'శివశర్మ' కన్పించలేదు. రాత్రి 9 గంటలకు నాన్న, గంగాధరశాస్త్రిగారు వరండా ప్రక్కగదిలో కూర్చొని పిచ్చాపాటి మాట్లాడుకొంటుండగా నౌకరును పిలచి, 'శివశర్మ'ను గురించి అడిగాను. మేడపై భాగంలో గదిలో వుంటారని చెప్పాడు.

పైకి వెళ్ళాను, నే నెవ్వరో తెలియని ఆ వ్యక్తి దగ్గరకు, ఆహ్వానం లేకుండానే, నాగరక ప్రవర్తనకు భిన్నంగా వెళుతున్నట్లు అనిపించింది.

నన్ను చూస్తూనే 'రండి' అన్నారు శివశర్మ. తెల్లని దేహచ్ఛాయ, చక్కని నవ్వు మొహం, లోతైన కనులు, ఉట్టిపడుతున్న ప్రశాంతత - నేనూహించినట్లే కన్పించారు.

★ ★ ★

శివశర్మ గది నుండి రెండు గంటల తరువాత తిరిగి రాగల్గాను. మునసబుగా

వెళ్ళి ముద్దాయిగా తిరిగి వచ్చినట్లు అయింది నా పని. ఆ మహా మేరుపు ముందు అల్ప మానవుణ్ణి అయ్యాను. ఆ విజ్ఞాన ధుని ముందు, ఆ జ్ఞాన ధురీణుని ముందు రేణువు నయ్యాను.

అర మూసిన కనులతో, ఆరముగ్గిన జీవితానుభవసారాన్ని నా ముందుంచాడు. ఈ జీవిత విలువలను, ఆద్యంతాలను, సృష్టిలోని వెలుగు చీకట్లను, సుఖ దు:ఖాలను, సంకల్ప వికల్పాలను, చర్విత చర్వణమైన ఈ జన్మానుభూతిని, సమీక్షించి సింహావలోకనం చేసారు. విజ్ఞాన సర్వస్వమైన శివశర్మ ముందు అప్రతిభుడనై, నేనక్కడకు వెళ్ళిన కారణాన్నే విస్మరించి కూర్చొనిపోయాను.

"చూడండి మురారీ... చివరికి మిగిలేదేముంది! అన్నీ కాలిపోయి, రాలిపోయేవే. సర్వమూ అశాశ్వతమూ, శూన్యమే. వియోగ భరమైన స్మృతులు; కన్నీటి ధారలు చరిత్ర గర్భంలో కలసిపోయే వ్యధాభరిత గాథలు. అంతే! బ్రతుకు పెనగులాటలో క్షతగాత్రమైన మందభాగ్యుల దు:ఖగీతికలు, దీనారావాలు... ఇవన్నీ వేటి ఫలితం?....? మనం అశాశ్వతమైన వాటి మీద పెంపొందించుకొంటున్న రాగ ద్వేషాల ఫలితం. అందుకే ఈ లిప్త పరిమాణ జీవితంలో, ఈ పీడిత మానవకోటికి సేవచేసి జీవితాన్ని పునీతం చేసికోవటం ధన్యతేమో అనిపిస్తుంది" అన్నారాయన.

శివశర్మను అక్కడ ఆపి ఉపక్రమించాను. 'నన్ను మేరి పంపలేదు, నేనే వచ్చాను. మీరన్నట్లు జీవిత సర్వస్వాన్ని పీడిత మానవకోటి సేవకై వినియోగిస్తున్న మేరి పట్ల మీకు సానుభూతి ఎందుకు నశించింది? ఆమెను నిరాకరించి, ఆమెలో జీవితాశను ఎందుకు నశింప చేస్తున్నారు?' అని ప్రశ్నించాను.

శివశర్మ ఈ ప్రశ్నతో చలిస్తారని ఎదురు చూచాను. ఆయన ఇదేదో నా నుండి ఎదురు చూసిన ప్రశ్నలా నాకేసి చూచి. "మేరి! అవును! యోగ్యురాలు. ఆ జీవిత విధానం గొప్పది. జీవన్మరణ వేదిక పొంత నిలచి ఆమె మానవకోటికి సేవ చేస్తోంది'' అన్నారాయన.

అందులో నా ప్రశ్నకు సమాధానం లేదు.

'ఆమెకు మీరేం చెపుతారూ....' అన్నాను.

'ఏముంది చెప్పటానికి నిష్కామమైన తన పవిత్ర సేవావృత్తినుండి, ఏ

నాడూ పారిపోవద్దని చెప్పండి.'

శివశర్మ నా కందకుండ మాట్లాడుతున్నట్లు అనిపించింది.

'మీరు ఏమైనా మాట్లాడండి, మతం పేరిట మేరీ పట్ల మీరు కఠినంగా ప్రవర్తించారు-' అన్నాను.

శివశర్మ మౌనం వహించినట్లు నాకేసి తలెత్తి చూచి 'మతం మానవుడి చేత 'సేవ' చేయిస్తుంది. ఏ మతానికైనా అంతిమలక్ష్యమిదే. అదే మతం. మానవుల మధ్య గిరులు గీచేది మతం కాదు-' అన్నారాయన.

'అయితే మీరు మేరికి అన్యాయం చేసారు'

ఈసారీ శివశర్మ నా కేసి చూచారు. ఆయన కనుల చెమ్మ కన్పించింది. విచలితుణ్ణి అయ్యాను. చాలా సేపటి వరకు అలా మౌనంగా వుండిపోయారు.

'మురారీ! ఎందుకీ అశాశ్వత బంధాలను సృష్టించుకొని బాధ పడటం? మమత దుఃఖ హేతువు, మేరీ లాంటి సేవాపరాయణిని, ఇలాంటి అశ్వరమైన బంధాలలో బంధించటం న్యాయం కాదు.'

శివశర్మ గది నుండి తిరిగి వచ్చాక నాన్నా వాళ్ళతోనైనా మాట్లాడకుండ హాస్పిటలుకు కారులో వెళ్ళిపోయాను. రాత్రి 11 గంటలయింది. హాస్పిటలు ఆవరణలో వున్న మేరి బంగళాకు వెళ్లాను. లోపల తన గదిలో గోడకు తగిలించి వున్న శివశర్మ ఫొటో కేసి చూస్తూ తదేకంగా చూస్తోన్న మేరి కన్పించింది.

ఆ ప్రేమమయి జీవిలో ఎంతటి వేదనా ప్రశాంతత అలముకొని వుందో!

శివశర్మను కలిసికొన్నట్లు చెప్పి, అక్కడదంతా చెప్పాను.

'డాక్టర్! వేదాంతాన్ని నమ్మి మానసికమైన శాంతిని ఈ ప్రజాకోటికి అందజేస్తూ ఆయన, వైద్యశాస్త్రాన్ని అభ్యసించి. అహోరాత్రాలు శ్రమించి, మీరు; మానవసేవకు జీవితాలను అంకితం చేసారు. ఈ జీవితాలంతే!' అన్నాను.

రెండు కన్నీటి బొట్లు రాల్చింది.

నా వార్డుకు తిరిగి వచ్చివేశాను. గదిలో లైటు ఆర్పి వుంది. లైటు వేసాను. పక్క అంతా చెదరి వుంది. సిస్టర్ ఫ్లొరెన్సు వచ్చినట్లు లేదు.

ఓ గంట అలా నిద్రించానేమో.... వార్డు బాయ్ నిద్ర లేపి ఫోను వచ్చింది అని చెప్పాడు. ఆఫీసు గది దగ్గరకు వెళ్లాను. గంగాధర శాస్త్రి గారింటి నుండి

నాన్న మాట్లాడారు. తెల్లవారుజామున మంచిదట, ప్రయాణానికి సిద్ధంగా వుండమన్నారు. గంగాధరశాస్త్రిగారి కారులో పది మైళ్ళలో వున్న రైలు స్టేషన్‌కు ప్రయాణంట.

ఏమిటో! వెళ్ళిపోదా మనిపించింది.

ఫోను పెట్టేసి వెనక్కి తిరిగాను. నర్సులంతా, ఐసోలేషన్ వార్డు కేసి కంగారుగా వెళుతున్నారు.

వాకబు చేసాను. సిస్టర్ ఫ్లారెన్సు మరణించిందట.

ఆ వార్త వింటూనే అయోమయ మయ్యాను. కాలం క్షణ కాలం ఘనీభవించి నట్లు అనిపించింది. మృత్యువు తన హస్తాన్ని ఎంత అకస్మాత్తుగా చాచిందో!

అరగంట క్రితం ఫ్లారెన్సు కనులు తిరిగి పడిపోయిందట డ్యూటి రూములో, అంతే! డా. మేరి చేసిన ప్రయత్నాలన్నీ తుత్తునియలుగా విఫలమవగా, ఆమె కన్ను మూసింది.

తెల్లని గుడ్డ క్రింద ఎంతో ప్రశాంతంగా కన్పించింది ఫ్లారెన్సు మోము.

ఏనాడో అమ్మ గతించిన నాటి సంఘటన క్షణ కాలం నా కనుల ముందు నిలచింది. హృదయమంతా కెలికినట్లు అయింది.

డా. మేరి గదిలోకి వెళ్లాను. అచేతనంగా రేగిపోయిన ముంగురులతో, ఆరిపోయిన కన్నీటి చారలతో శూన్యంలోకి చూస్తూ కన్పించింది.

'ఏమిటిది?' అని ప్రశ్నించాను.

విధి నిర్ణయం మురారీ! 'శివం' చెప్పింది నిజం. మిగిలేదేదీ లేదు. అంతా రాలిపోయేదీ కాలిపోయేదే. వెళ్ళిపోతున్నాను. ఈ పరిసరాలకు దూరంగా, పారిపోతాను మనశ్శాంతిని వెతుక్కొంటూ-' అంది.

'వద్దు మేరీ.... అలా చేస్తే మరీ అశాంతికి గురవుతావు. శివం చెప్పింది నిజమన్నావు. నీ శివం ఏమి చెప్పాడో తెలుసా! ఏనాడూ నిష్కామమైన నీ పవిత్ర సేవాధర్మం నుండి పారిపోవద్దని చెప్పారు. ఆలోచించు-'

అంతర్ముఖురాలైనట్లు మేరి మౌనం వహించింది.

'నేను తెల్లవారుజామున వెళ్ళిపోతున్నాను. మీరొనర్చిన సేవకు, సహచర్యానికి కృతజ్ఞుణ్ణి. ఫ్లారెన్సుకు చెప్పుకోలేకపోయాను. ఆమె స్మృతి నాలో మిగిలిపోయివుంటే

ధన్యుణ్ణి. ఈ జీవిత పరిధిలో ఎక్కడైనా మళ్ళీ బాటసారుల్లా కలుసుకోగలమేమో.... ఏమో?'

మేరి కనులు మూసికొని, ఏవో భావాలను వెలికి నెట్టివేస్తున్నట్లు కన్పించింది.

'ఇదిగోండి.... శివశర్మ ఇది నాకిచ్చారు. నేను మీ కిస్తున్నాను.'

'ఇది మీకు ఆత్మబలాన్ని ఇస్తుంది' అని శివశర్మ నా కిచ్చిన భగవద్గీత నిచ్చాను.

డా. మేరి తీసికొంది. తన చరమ క్షణాలలో సిస్టర్ ఫ్లారెన్సు తన కిచ్చిన బైబిలు చూసింది.

'ఈ రెండు నాకు నేత్రాల్లా ఉపయోగిస్తే ధన్యురాలిని-' అంది.

ఏదో నిర్ణయం చేసికొన్నట్లు గుభుక్కున లేచి, 'పదవ వార్డులో పద్మావతి కాన్పు వుంది' అంటూ లేచి వెళ్ళింది. ఆమె జీవితంలో ఇక అపరాజిత అన్పించింది. తెల్లవారు జామున గంగాధరశాస్త్రిగారి కారులో నాన్న వచ్చారు ప్రయాణానికి సిద్ధమై. డా. మేరికి నాన్న కృతజ్ఞత చెప్పారు.

ఆ మంచులో తల నిండా మఫ్లర్ చుట్టుకొని డా. మేరి నాకు వీడ్కోలు చెప్పింది.

'గుర్తుంచుకోండి' అన్న మేరి చివరి మాటలు, ఆ గ్రుడ్డి వెన్నెల వెలుగులో ఆమె నేత్రాల నుండి రాలిపడిన భాష్పాలు; ఎన్నో సంవత్సరాల స్మృతి కన్నట్లు, విన్పించి కన్పించాయి. ●

## కథ వెనుక కథ :

ముప్ఫయి సంవత్సరాల క్రితం ఆంధ్రదేశంలోని ఒక మిషన్ హాస్పిటల్లో, నా అర్ధాంగి నెల రోజులు చావు బ్రతుకుల మధ్య పెనగులాడి కనుమూసింది. ఆ నెల రోజులూ ఆ హాస్పిటల్లో సేవాపరాయణురాలైన ఓనర్సును, అవివాహిత అయిన ఒక లేడీ డాక్టరును గమనించటం జరిగింది.

ఆ లేడీ డాక్టరు అవివాహితగా వుండిపోవటానికేవో కారణాలను చెప్పు కొనేవారక్కడ. (సీతారామయ్య మరో సందర్భంలో తటస్థ పడ్డ రోగి).

★ (*చుక్కాని : 15-6-1964/1-7-1964*) ★